

అంతర్యామి...
గోవుల గతి ఏమి..?



- కనుమరుగవుతున్న దేవస్థానం పశువులు
- పట్టించుకోని అధికారులు..

మనదేశంలో గోవులను దైవంగా పూజిస్తారు. గోవులు ఎదురుపడితే మంచి శకునంగా భావిస్తారు. అనాది కాలంగా గోవులను శ్రీకృష్ణుని వాహనంగా భావిస్తారు. దైవంగా భావించే గోవులు నేడు కొందరి స్వార్థానికి కనుమరుగవుతున్నాయి. అందులోనూ దేవస్థానానికి చెందిన గోవులను గుట్టుచప్పుడు కాకుండా మటుమాయం చేయడం విచారకరం. ఇంతటి దారుణం ఎక్కడ జరుగుతుందని భావిస్తున్నారా..? చూడండి.

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు, పెనుమూరు మండలాల పరిధిలో కలిగిరి కొండ దేవస్థానం ఉంది. ఈ దేవస్థానం గతంలో ఎండోమెంట్ పరిధిలో ఉండేది. అనంతరం గత కొన్ని సంవత్సరాల క్రితం ఈ దేవస్థానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోకి తీసుకొచ్చారు. ఇక్కడ కొలువై ఉన్న వెంకటేశ్వరుడు కోరిన కోర్కెలు తీరుస్తాడని భావన ప్రజల్లో గట్టిగా ఉంది. ఇందులో భాగంగా భక్తులు తమ కోరికలు తీరిన వారు దేవస్థానంకు పశువులను కానుకగా ఇస్తుంటారు. ప్రస్తుతం సుమారు 900 పశువుల వరకు కొండపై ఉన్నాయి. ఇవి ఉదయం కొండపై మేతకు వెళ్లి సాయంత్రానికి గుడి వద్దకు చేరుకుంటాయి. ఉదయం సాయంత్రం వేళల్లో గుడి వద్దకు వెళితే పశువులు ఆహ్లాదకరంగా కనిపిస్తాయి.

వేసవిలో ఇబ్బందులు..

వేసవికాలంలో కొండపై మేత అందకపోవడంతో కొండ దిగి చుట్టుపక్కల ఉన్న పంటచేళ్లపై పడుతుంటాయి. రైతులు పశువుల వలన కొంత ఇబ్బందులు పడినా.. తమ పంటను కాపాడుకోవడానికి కంచెలు వేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు. మరి కొందరు ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల వద్ద కాపలా ఉంటున్నారు. మార్చి నుంచి మే నెల వరకు రైతులకు దేవస్థానం పశువుల వలన కొంతవరకు ఇబ్బందులు ఉన్నాయి.

ఎద్దుల తోనే ప్రమాదం..

దేవస్థానానికి చెందిన ఎద్దులతో కొంతవరకు ప్రమాదం ఉంది. కొన్ని భారీ ఎద్దులు మనిషిని చూస్తే దాడికి దిగుతున్నాయి. గతంలో ఒక ఎద్దు దాడిలో రైతు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కొన్ని ఎద్దులు గ్రామాల వైపు కూడా వచ్చేస్తున్నాయి. దీంతో రైతులతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా భయాందోళన చెందుతున్నారు. ఎద్దులు కనిపిస్తే గుట్టుచప్పుడు కాకుండా తప్పించుకొని పోతున్నారు.

విద్యుత్ షాక్‌తో మట్టు పెడుతున్నారు..

భారీ ఎద్దులు పంటలు, మామిడి చెట్లను ధ్వంసం చేస్తున్నాయని.. కొందరు రాత్రిపూట పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. విద్యుత్ తీగలకు బలైన ఎద్దులను గుట్టుచప్పుడు కాకుండా జెసిబిలతో గుంతలు తవ్వి పూడుస్తున్నారని గుసగుసలాడుకుంటున్నారు. మరికొందరైతే పాలిచ్చే పశువులను గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి.


పట్టించుకోని అధికారులు..

దేవస్థానానికి చెందిన పశువుల బాగోగులు చూడాల్సిన అధికారులు ఇవిఏమీ పట్టినట్టు వ్యవహరించడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు కొండపైనే తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తే కొండపై నుంచి కిందికి రావని ఇందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో జగన్నాధపురం

నేటికీ డోలీ సాయంతోనే ఆస్పత్రులకు..

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నిఏళ్లే అవుతున్నా.. ఇప్పటికీ గిరిపుత్రుల కానీలు రోడ్డు సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ఓ వైపు రాష్ట్రం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందుతుంటే.. వీరి నివాసాలకు అత్యవసర పరిస్థితుల్లో కూడా వాహనాలు వెళ్లడానికి వీలులేని దుస్థితి. నేటికీ అత్యవసర పరిస్థితుల్లో డోలి కట్టుకుని రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందే.. ఇక రేషన్ సరుకుల కోసం ఐదు కిలోమీటర్లు వెలకతప్పదు.. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారవంటూ ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..


కోతకు గురై అధ్వానంగా మారిన జగన్నాధపురం రోడ్డు

- రోడ్డు కూడా లేని ఎస్టీ కాలనీ
- రేషన్ కోసం 5 కిలో మీటర్లు నడవాల్సిందే..
- కనీస సౌకర్యాలు లేని కాలనీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: జగన్నాధపురం ఎస్టీ కాలనీ మండల కేంద్రానికి సుమారు 20 కిలో మీటర్ల దూరంలో తమిళనాడుకు సరిహద్దు ప్రాంతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఓ మోస్తారు వర్షాలు కురిసిన కొండల నుంచి వచ్చే వర్షపు నీటితో కాలనీకి సమీపంలోని చెరువు నిండిపోతుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయి గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లలేక గ్రామానికే పరిమితవుతుంటారు స్థానికులు. ఇక ఈగ్రామంలో ఎవరైనా అనారోగ్యంపాలైనా.. గర్భవతులు ప్రసవానికి వెళ్లాల్సి వచ్చినా నేటికీ మంచాలు, డోలీల మోత్త తప్పడం లేదని కాలనీవాసులు కన్నీటిపర్యంతమవుతున్నారు. దీనికి తోడు గ్రామానికి రోడ్డు లేదని ఉన్న కాలిబాట కూడా వర్షం వచ్చిన కోతలకు గురై రాళ్లు తేలిపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని స్థితికి చేరిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం వాహనం రావడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. దీనికి తోడు ప్రభుత్వం పేదలకు ఇచ్చే నిత్యావసర సరుకులు తీసుకోవాలన్నా 5 కిలో మీటర్లు దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గతం ప్రభుత్వంలో రేషన్ సరుకుల వాహనం గ్రామానికి సమీపంలో వచ్చి అందించేవారని, కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక సరుకుల పంపిణీ చేసే వాహనాలు మారుమూల ప్రాంతాలకు రాకపోవడంతో తమకు మోత తప్పడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జగన్నాధపురం ఎస్టీ కాలనీని సందర్శించి గ్రామానికి బీటీ రోడ్డు ఏర్పాటు చేసి మౌళిక వసతులు కల్పించాలంటున్నారు.

మా బతుకులు మారవా..
- లత, జగన్నాధపురం




మాది జగన్నాధపురం ఎస్టీకాలనీ. మండలానికి 20 కిలో మీటరు దూరంలోనే ఉంది. అయినా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకుండా ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో మౌళిక వసతులు కల్పించే దిక్కులేదు. ప్రభుత్వ అధికారులు మా గ్రామాన్ని సందర్శించన పాపానపోలేదు. గిరి పుత్రులు ఉన్న గ్రామానికి రోడ్డు సౌకర్యానికి నోచుకోలేక పోతున్నారు. ఎప్పటికీ మా బతుకులు మారేటట్లు లేదు.

ఇప్పటికీ డోలీలపై తీసుకెళుతున్నాం..
- పద్మ, జగన్నాధపురం



మా ఊరికి రోడ్డు సౌకర్యం లేదు. వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఎవరికైనా జబ్బు చేసినా, ప్రమాదం జరిగా అత్యవసర పరిస్థితులో మంచాలు, డోలీలపై ఆస్పత్రులకు మోసుకెళ్తున్నాం. ఇలాంటి పరిస్థితులో కొందరు చనిపోయారు కూడా. గ్రామానికి ఉన్న మట్టి రోడ్డు కోతకు గురికాకుండా సీసీ రోడ్డు, బీటీ రోడ్డు ఏర్పాటు చేసి 108, 104 వాహనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.


అభివృద్ధికి నోచుకోని జగన్నాధపురం ఎస్టీకాలనీ

సరుకుల మోత తప్పడం లేదు..
- గిరి, జగన్నాధపురం



గత ప్రభుత్వంలో నిత్యావసర సరుకులు ఇచ్చే వాహనం గ్రామానికి వచ్చి సరుకులు అందించే వారు. ఇప్పుడు నిత్యావసర సరుకుల కోసం 5 కిలో మీటర్ దూరం వరకు వెళ్లక తప్పడం లేదు. అటవీ ప్రాంతంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. దారిలో ఏం జరిగిన నీళ్ళు పోసే దిక్కు ఉండరు. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేసి, గ్రామానికి వాహన రాకపోకలు జరిగే విధంగా చూడాలి.

ఇళ్ల నిర్మాణ పనుల పురోగతికి చర్యలు

అదనపు సాయంపై అవగాహన కల్పించండి : కలెక్టర్


గృహ నిర్మాణ పురోగతిపై నిర్వహించిన సమావేశం మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇండ్ల నిర్మాణానికి అదనంగా రూ.50 నుంచి లక్ష రూపాయల వరకు అందిస్తున్న ప్రభుత్వ ఆర్థికసాయం గురించి లబ్ధిదారులకు తెలియజేసి ఇంటి నిర్మాణ పనుల్లో పురోగతి ఉండేలా పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ హౌసింగ్ శాఖ పురోగతిపై హౌసింగ్ డీఈ, ఈఈ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడంలో భాగంగా ఇదివరకే ఇంటి నిర్మాణాలు చేపట్టి అర్ధాంతరంగా ఆగిన ఇండ్ల నిర్మాణాల పురోగతికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. తద్వారా 17,898 మంది లబ్ది దారులకు రూ.119.65 కోట్లు లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై క్షేత్రస్థాయిలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు అవగాహన కల్పించి వివిధ దశలలో ఉన్న ఇండ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. అదనపు సాయం పొందేందుకు బేస్మెంట్ లెవెల్ స్థాయిలో ఏఈ, రూఫ్ లెవెల్ స్థాయిలో, డీఈ రూఫ్ కాస్ట్ స్థాయిలో బాధ్యత తీసుకొని ఇండ్ల నిర్మాణ పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 15 నుండి 23వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయంపై వివరించే ప్రక్రియను చేయాలన్నారు. కంప్లీషన్ స్టేజ్‌కి సంబంధించి ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు, ఇంటి బయట లోపల పెయింటింగ్ మిగిలిన అన్ని పూర్తిస్థాయిలో పూర్తి చేసిన సమయంలోనే కంప్లీట్ స్టేజి వస్తుందని తెలిపారు. మండలాల వారీగా ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికాబద్ధంగా ఇండ్ల నిర్మాణాల పురోగతికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

డబ్బు కోసమే దోపిడీ..

ఏడుగురిని అదుపులోకి తీసుకున్నాం : జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలో బుధవారం చోటు చేసుకున్న దోపిడీ కేసులో నిందితులు పుష్ప కిడ్స్ షాపింగ్‌మాల్ యజమాని చంద్రశేఖర్ ఇంటిలో డబ్బుకోసం దోపిడికి పాల్పడారని, ఈ దోపిడీలో డ్రైవర్‌తో కలిపి మొత్తం ఏడుగురు నిందితులు పాల్గొన్నారని, ఘటనా స్థలం వద్ద నలుగురిని అదుపులోకి తీసుకోగా మిగిలిన ముగ్గురు నిందితులను గురువారం సాంకేతిక సమాచారం ద్వారా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దోపిడీ ఘటనలో ప్రధాన ముద్దాయి సుబ్రమణ్యం (55) 15ఏండ్ల క్రితం చిత్తూరు నగరంలోని రెడ్డిగుంట ప్రాంతంలో ఎస్ఎల్‌వి ఫర్నిచర్ షాపును నిర్వహించేవాడని, ఇతడిపై 2005, 06లో నంద్యాల, అనంతపురం జిల్లాలో రెండు మర్డర్ కేసులు, నంద్యాలలో ఆరు కేసులు ఉన్నాయని, 10 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడని తెలిపారు. చిత్తూరులో ఫర్నిచర్ షాపు పెట్టి అప్పులపాలవ్వడంతో డబ్బు కోసం షాపింగ్ మాల్ యజమాని (రియలేస్టేట్) వ్యాపారి కావడంతో చంద్రశేఖర్‌ను ఎంచుకుని బెదిరించి డబ్బులు తీసుకొనేందుకు ప్రయత్నించిన్నట్లు తెలిపారు. ఏ వన్ ముద్దాయి సుబ్రమణ్యంకు పుష్ప కిడ్స్ షాపింగ్‌మాల్ యజమాని చంద్రశేఖర్‌కు ఇద్దరి మధ్య పరిచయం కూడా ఉందన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఏడుగురు ముద్దాయిలో ఏవన్ ముద్దాయి సుబ్రమణ్యం తప్పించుకొనే ప్రయత్నంలో తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మిగిలిన ఆరుగురు ముద్దాయిలు ఇబ్రహిం, నవీన్ కుమార్, రామాజనేయులు, నెట్టికంఠయ్య, సంపత్ కుమార్‌లను మీడియా ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారని, ముద్దాయిల్లో సుబ్రమణ్యం స్థానికుడు మిగిలిన ఆరుగురు కర్నూల్, అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందినవారని తెలిపారు. ఈ దోపిడీకి సూత్రధారి సుబ్రమణ్యంగా గుర్తించారు.


నిందితులను చూపుతున్న జిల్లా ఎస్పీ

పక్కా ప్రణాళికతోనే...

పక్కా ప్రణాళికతోనే బుధవారం ఉదయం 5.30 గంటకు తమిళనాడు రిజిస్టేషన్ ఓమ్ని వాహనంలో డ్రైవర్‌తో సహా ఏడుగురు ముసుగులు ధరించి చంద్రశేఖర్ ఇంట్లో రెండో అంతస్తులోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న చంద్రశేఖర్‌ను వెంట తెచ్చుకున్న నకిలీ తుపాకులు, కత్తులను చూపించి డబ్బులు ఇవ్వాంటూ బెదిరించారు. ప్రతిఘటించిన చంద్రశేఖర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో చంద్రశేఖర్ ముఖం, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో స్థానిక యువత సాయంతో మేడపై నుంచి దూకిన ఏ ఎన్ సుబ్రమణ్యంను, మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఇంట్లో ఇంకా ఎవరైనా ఉన్నారా అనే సందేహంతో స్పెషల్ పార్టీ పోలీసుల ద్వారా గాలించారు. తప్పించుకున్న రాజశేఖర్, సంపత్, నెట్టి కంఠయ్యను టూ టౌన్ సిఐ నెట్టికంఠయ్య, సిబ్బంది గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు కాణిపాకం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.

పీఈఎస్‌లో మెడికల్ రికార్డులు తొలగింపు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పిఇఎస్ ఆసుపత్రిలో 2019 సంవత్సరంకు ముందు ఉన్న మెడికల్ రికార్డులను తొలగించనున్నట్టు మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం ఎన్‌కె గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. 2019కి ముందు ఆసుపత్రిలో వైద్యసేవలు పొందిన వారి రికార్డులను ఆసుపత్రి పాలసీలను అనుసరించి తొలగించడం జరుగుతుందన్నారు. ఈ రికార్డులు అవసరమైన వారు మార్చి 31వ తేదీ లోపు ఆసుపత్రి మెడికల్ రికార్డు ఆఫీస్ నెంబరు 9959011628లో సంప్రదించి తమ వైద్యసేవల రికార్డులను పొందవలెనని సూచించారు.

తాగునీటి సమస్యకి మొదటి ప్రాధాన్యత



ప్రజాశక్తి- యాదమరి: జిల్లాలో రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా నిధులను సద్వినియోగం చేయాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని వరదరాజులపల్లి గ్రామపంచాయతీని ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో ఇంటింటికి చెత్తబుట్టల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వరదరాజులపల్లిలో చెత్తసేకరణ కేంద్రాన్ని, గ్రామంలో నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకుల పరిసరాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సరఫరా చేసే నీటిలో ఎక్కడా పైప్ లైన్లు కలుషితం కాకుండా సురక్షిత మంచినీరు వారికి చేరేలా చూసే విషయంలో సెక్రటరీలు శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రామపంచాయతీ నిధుల సద్వినియోగంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఈ అంశాన్ని సెక్రటరీలు గుర్తుపెట్టుకుని పనిచేయాలన్నారు. పిఆపి ఆర్‌డి సుకుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పూర్ణిమ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాచైతన్య యాత్రను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఉన్న స్థానిక సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో 15 నుండి ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని గురువారం చిత్తూరులో జరిగిన జిల్లా కమిటీ సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశానికి భువనేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ ప్రజలు స్థానిక సమస్యలపై చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యలను పరిష్కారం కోసం సిపిఎం ప్రజా చైతన్య యాత్ర చేపట్టిందని తెలిపారు. యాత్రలో ప్రజలు తెలిపే సమస్యలన్నిటిని నోట్ చేసి 20వ తేదీ తర్వాత అధికారులు దగ్గర సమస్యలు పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని తమరు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ కూడా తెలియజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పది నెలలు అధికారం చేపట్టి కూడా గ్రామీణ ప్రాంతాల్లోనూ పట్టణాల్లోనూ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి గురించి పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. అందుకే ప్రజలను చైతన్యం చేయడానికి ప్రజా చైతన్యయాత్ర చేపట్టామని యాత్రకు అందరు సహకారం అందించాలని కోరారు. జిల్లాలోని సిపిఎం కార్యకర్తలు అందరూ ప్రజాచైతన్య యాత్రలో పాల్గొని ప్రజల చెప్పే వాటిని విని వాటి పరిష్కారం కోసం యాత్రలు కొనసాగాలని తెలిపారు. జిల్లాలో నాలుగు టీములుగా నింద్ర నుంచి పుంగనూరు వరకు అన్ని మండలాలలో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. జిల్లా నాయకులు సురేంద్రన్, ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

రూ.2,59,760లు రికవరీ



ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పనుల్లో 2023- 24 సంవత్సరానికి జరిగిన పనుల్లో రూ.2,59,760లను రికవరీ చేయాలని డ్వామా పీడీ రవికుమార్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఉపాధి హామీ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో 1, ఏప్రిల్ 2023 నుండి 31 మార్చి 2024 వరకు రూ.17 కోట్ల 65 లక్షల 765 రూపాయలు పనులు చేపట్టారు. దీంతో 13 కోట్ల 95 లక్షల రూపాయలు లేబర్ పేమెంట్లు చేపట్టారు. మూడు కోట్ల 75 లక్షలు మెటీరియల్ పేమెంట్ చేపట్టారు. జరిగిన పనుల్లో జరిమానా రూ.71 వేలు రికవరికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటరత్నం , డీవీఓ శివయ్య, ఎస్‌డిపి మల్లికార్జున, టిడిపి మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, రాజసింహ ఆంజనేయప్ప, బాలరాజు, సుబ్రి పాల్గొన్నారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి 'మొల్ల'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుంచి సరళంగా అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగు బాషలోకి అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్‌లో కవయిత్రి మొల్ల చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని కేవలం 5 రోజులలో సంస్కృతం నుండి 6 కాండలతో 871 పద్యాలతో తెలుగులో అనువదించారన్నారు. కవయిత్రి మొల్ల 16వ శాతాబ్ది కవి అని, మొల్ల పై పోతన కవితా ప్రభావం ఎక్కువగా ఉండేదని అన్నారు.

కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కుమ్మర శాలివాహన సాధికార కమిటీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో తొలి మహిళ కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. పి.మనోహర్, మున్సిపల్ అధ్యక్షులు రాజ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి గోపీనాథ్, క్లస్టర్ ఇంచార్జ్ సతేంద్ర శేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, విస్తీర్ణ కమిటీ సభ్యులు కన్నన్ పాల్గొన్నారు.

కుప్పంలో సింగపూర్ ప్రతినిధులు


కుప్పం పట్టణంలో పర్యటిస్తున్న సింగపూర్ ప్రతినిధులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: సింగపూర్ దేశానికి చెందిన సుర్బాన జార్జ్ కన్సల్టేన్సి సభ్యులు గురువారం కుప్పం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని హరిత రిసోర్స్, జమిందార్ పార్క్, డి.కే.పల్లి పార్క్, బస్టాండు, ఎన్.టి.ఆర్. స్టేడియం, కొత్తపేట మార్కెట్, ఫ్లెక్స్, పట్టణంలోని 11 ప్రధాన కూడళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కుప్పం పట్టణ అభివృద్ధిలో భాగంగా డి.పి.ఆర్ సిద్ధం చేయడానికి సింగపూర్ ప్రతినిధులు పట్టణంలో పర్యటించినట్టు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన విధంగా రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేసి, కృషి చేస్తున్నామన్నారు. సింగపూర్ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షన్‌లో చిత్తూరుకు ఓటెయ్యండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణలో చిత్తూరు నగరానికి ఓటు వేసి మొదటి స్థానంలో నిలపాలని నగర మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. గురువారం నగరపాలక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛసర్వేక్షన్ ఓటింగ్‌పై రూపొందించిన పోస్టర్లను మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్ కోసం దేశవ్యాప్తంగా ఓటింగ్ కార్యక్రమం జరుగుతుందని, ఆన్‌లైన్లో జరిగే ఓటింగ్ కార్యక్రమంలో నగర ప్రజలు, యువత, మహిళలు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని చిత్తూరు నగరానికి పాజిటివ్‌గా ఓటింగ్ చేయాలన్నారు. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ ఓటింగ్ ఎలా చేయాలనే అంశాలపై ప్రతి వార్డు సచివాలయంలోనూ, నగరపాలక సామాజిక మాధ్యమాల్లో క్యూఆర్ కోడ్, స్వచ్ఛ సర్వేక్షన్ లింక్ అందుబాటులో ఉందన్నారు. నగర ప్రజలంతా ఓటింగ్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

మండలంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - సోమల: సోమల మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలు, ఇరికిపెంట, కందూరు సచివాలయం, కందూరు ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా టూరిజం అధికారిని, సోమల మండల ప్రత్యేక అధికారిని గౌరీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో వృద్ధులు, వికలాంగులు రావడానికి మెట్లకు ఇబ్బందికరంగా ఉన్నాయని వాటి స్థానంలో ర్యాంపులు ఏర్పాటు చేయాలని, గదులు చాలడం లేదని పైపులైన్ లీకేజీ ఉందని ప్రత్యేక అధికారికి తెలపగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఏ విధంగా పౌష్టికాహారం అందుతుంది, గర్భవతులకు బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారా లేదానని అడిగి తెలుసుకున్నారు. ఇరికిపెంట సచివాలయంలో రికార్డులను పరిశీలించి సిబ్బందిని పలు ప్రశ్నలు వేసి వారి వద్ద సమాధానాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో దినకర్ బాబు, పంచాయతీ కార్యదర్శి మేనక పాల్గొన్నారు.

యువత పోరు కాదు.. దగా పోరు..

ప్రజాశక్తి- పలమనేరు: వైసీపీ యువత పోరు పేరుతో తలపెట్టిన కార్యక్రమం చాలా హాస్యాస్పదంగా ఉందని పలమనేరు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మురళి అన్నారు. పలమనేరు టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మురళి మాట్లాడుతూ 2014- 2019 అప్పటి టిడిపి పాలనలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే జగన్‌రెడ్డి పాలనలో దానిని కుదించి కాలయాపన చేస్తూ 7లక్షల పేదవిద్యార్థులను మోసగించిందని ఈ విషయం పై వైసిపి నేతలు సిగ్గు లేకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెట్టిన బకాయిల కారణంగా డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ ఇతర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఎన్నో కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. ఉన్నత విద్య చదివే అవకాశం లేకుండా విద్యార్థులు ఎన్నో ఉద్యోగ అవకాశాలు కోల్పోయారన్నారు. వైసీపీ మాయ మాటలు నమ్మే పరిస్థితుల్లో నేటి యువత లేదన్నారు. నాయకులు సునీల్ రాజు, సతీష్ కుమార్, యశ్వంత్, మహేష్ బాబు, బాలవిన్, మురళి, కుమార్, అనిల్ కుమార్, గణేష్ పాల్గొన్నారు.

పరిశోధన నైపుణ్యాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి- పూతలపట్టు: విద్యార్థులు పరిశోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వేము ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు సూచించారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రజ్ఞ 2కె-25 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడానికి పరిశోధన అభివృద్ధికి మెల్లెన వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకుల సహకారంతో తయారుచేసిన అనేక ప్రాజెక్టుల ద్వారా ప్రతిభను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిరాణి అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి: డీపీఓ

ప్రజాశక్తి- ఐరాల: గ్రామ పంచాయతీలలోని అన్ని రకాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు తెలిపారు. గురువారం ఆయన ఐరాల మండలంలోని కాణిపాకం గ్రామ పంచాయతీ, పొలకల గ్రామ పంచాయతీ కార్యాలయాలలోని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని గ్రామ పంచాయతీలలో క్రమబద్ధంగా రిజిస్టర్ల నిర్వహణ చేసేలా పంచాయతీ కార్యదర్శులు తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి కుసుమ కుమారి, పొలకల పంచాయతీ సెక్రటరీ చిరంజీవి పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఐరాల: కామినాయనపల్లె గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలలో గురువారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌పై పంచాయతీ కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందితో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకూడదని, పేడ దిబ్బలను జనావాసాలకు దూరంగా వేసుకోవాలని, రోజువారీ వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి పంచాయతీ వాహనాలు వచ్చినపుడు ఇవ్వాలన్నారు. దీని వలన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేసి తిరిగి అమ్మడం వలన చెత్త నుంచి సంపద సృష్టించడానికి వీలు అవుతుందని తెలిపారు.

స్కిల్ యాప్‌తో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: వ్యవసాయ క్షేత్రం నుంచి స్కిల్ యాప్‌తో బహుళ ప్రయోజనాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారిని జ్యోతి రిసోర్స్‌పర్సన్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక రైతుసేవ కేంద్రంలో మండల వ్యవసాయశాఖ సిబ్బందికి రైతులకు స్కిల్ యాప్‌పై డిజిటల్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు రైతు సేవాకేంద్ర సిబ్బందికి వాతావరణ సమాచారం గురించి అవగాహన కల్పించడం ద్వారా వాతావరణ సమాచారానికి అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టడం, వివిధ మార్కెట్ ధరలను వ్యవసాయ యాప్ ద్వారా తెలుసుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా డిజిటల్ చెల్లింపులు గురించి వారికి వివరించారు. ఆఫీసర్ శివప్రసాద్, శిక్షకులు చంద్రశేఖర్, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రజాశక్తి- రొంపిచర్ల: మండలంలోని బండకిందపల్లె గ్రామపరిధిలోని పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లి గ్రామాల్లోని ప్రజలకు సురక్ష హెల్త్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడు ఊటుకూరి మదనమోహన్ రెడ్డి, పంచ తులసి డ్రాప్స్, రేడియేషన్ చిప్‌లను నామమాత్రం ఫీజుతో అందజేశారు. అలాగే గ్రామంలోని దివ్యాంగులకు యాంటీ రేడియేషన్ చిప్‌లను ఉచితంగా అందజేశారు. మదనమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. బిపి, పల్స్, టెంపరేచర్ పరీక్షలను గ్రామీణ ప్రజలకు ఉచితంగా నిర్వహించి తగు సూచనలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు 200 మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారు. సురక్ష చారిటబుల్ ట్రస్ట్ ఎండి అన్నగారి ప్రసాద్, మండల కోఆర్డినేటర్ ఎం.మనోజ్ కుమార్, టిడిపి నాయకులు ఎం.భాస్కరయ్య, సదుం చంద్రారెడ్డి, జాహిద్, శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి సహకరించాలి

ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తల్లులు విద్యార్థుల ఉన్నతికి సహకరించాలని ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కూర్మాయపల్లి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను పాఠశాలకు పంపడంలో శ్రద్ధచూపాలని, పాఠశాల ముగిసిన తర్వాత ఇంటి వద్ద చదివించాలని అన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కరించుకుని తల్లులకు దుశాలువులతో సన్మానించి జ్ఞాపికలు పంపిణీ చేశారు. సర్పంచులు హేమలత, దాతలు జ్యోతీశ్వర్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, మల్లీశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు రఘుపతి నాయుడు, సిఆర్‌పి సతీష్ పాల్గొన్నారు.

దుకాణాలు తొలగింపు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు గంగమ్మ గుడివీధి, శివాలయం ముందు ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న రోడ్డుపై గల చిరు దుకాణాలను, కూరగాయల అంగళ్లను రైతు బజార్లోకి మార్పిపిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు. ఈ అంగళ్ళ వలన ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉందని, చాలా ఫిర్యాదులు అందాయని, కనుక ఎమ్మెల్యే ఆదేశానుసారం అంగళ్లను దినసరి కూరగాయల మార్కెట్లో, రైతు బజార్లో వాళ్ళకు కేటాయించిన స్థలాల్లో పెట్టుకోవాల్సిందిగా ఆదేశించారు.

నేనున్నానంటూ భరోసా..

ప్రజాశక్తి- విజయపురం (నగరి): అయినవాళ్లను పోగొట్టుకున్న కుటుంబానికి, ఆపదలోపడ్డ కుటుంబానికి తానున్నానంటూ మాజీ మంత్రి ఆర్కేరోజా భరోసా ఇచ్చారు. గురువారం మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడకు వెళ్లిన ఆమె ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత జయశీలన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమాన్‌బాయ్ కుమార్తెను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకుని బాధితురాలిని ఓదార్చారు. అనంతరం ఇటీవల మాతృవియోగానికి లోనైన సలీంను కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ కన్వీనర్ రమేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బీడీ భాస్కర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు మోహన్‌రాజ్, ఇంద్రయ్య, మురగయ్య, యాకోబు, వెంకటేశ్, హమీద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రశంస

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని కావేటిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షిక తనిఖీ నిర్వహించిన ఎంఈవో శ్రీదేవి ఉపాధ్యాయులను ప్రశంసించారు. గురువారం ప్యానల్ సిబ్బంది, సీఆర్పీలతో పాటు పాఠశాలలో ప్రార్థనా సమయం నుంచి సాయంత్రం వరకు జరిగే ప్రతి అంశాన్ని తనిఖీ చేశారు. తరగతి గది నిర్వహణ, మధ్యాహ్న భోజన పరిశీలన, 1 నుంచి 5వ తరగతులకు క్యాలెండర్ అమలు, 3,4,5 తరగతుల కనీస అభ్యసన సామర్థ్యాలైన టీక్యూఆర్ఎల్‌ను పరిశీలించారు. బేస్‌లైన్, మిడ్‌లైన్ పరీక్షా ఫలితాలను పరిశీలించి ప్రగతి కనిపించడంతో ఉపాధ్యాయులు దుర్గ, హేమావతిని అభినందించారు. వెనుకబడిన ముగ్గురు విద్యార్థుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో

అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం అకడమిక్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ నిర్వహించారు. పీవీకేఎన్ కళాశాలకు చెందిన డాక్టర్ తిరుకుమారన్, ఎస్‌పీఎస్ కళాశాలకు చెందిన డాక్టర్ మల్లికా భ్రమరాంబ ఆడిట్‌లో భాగంగా రికార్డులు తనిఖీ చేశారు. ఆడిట్ సమావేశంలో రికార్డులపై సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ ఆర్.వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.భాస్కర్ రాజు, ఐక్యూ కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఫిలాట్ అలీ పోటీల్లో ప్యాక్తో స్టీఫెన్స్ ప్రతిభ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దీన్ దయాల్ స్పర్శ యోజన భారతీయ పోస్ట్ డిపార్ట్మెంట్ జాతీయస్థాయిలో నిర్వహించిన ఫిలాట్ అలీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ కర్నూల్ డివిజన్‌స్థాయిలో చిత్తూరు జిల్లా విద్యార్థి ఎవిన్ ఫ్యాక్టో స్టీఫెన్స్ ప్రథమ స్థాయిలో నిలిచాడు. ఇతడు స్థానిక బీవీ రెడ్డి స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్నాడు. గురువారం చిత్తూరు జిల్లా హెడ్ పోస్ట్‌ఆఫీస్ చీఫ్ సూపరింటెండెంట్ బి.లక్ష్మణ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. తపాలా సిబ్బంది పాల్గొన్నారు. ఈక్రమంలో భారతీయ పోస్టల్ డిపార్ట్మెంట్ వారు సదరు విద్యార్థికి రూ.6000లు నగదు ప్రోత్సాహక బహుమతిని అతని అకౌంట్లో జమ చేశారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం పిహెచ్‌సి పరిధిలోని మురారిపల్లిలో గురువారం ఎన్‌సిడి స్క్రీనింగ్, ముందస్తు కేన్సర్ పరీక్షలు చేయడం జరిగిందని హెచ్‌ఈ కాంతమ్మ తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, కేన్సర్ రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు పాటించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పి ప్రతిమ, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సంక్షేమ ఫలాలను అందిస్తోందని పశుసంవర్ధక శాఖ ఏడీ మురళీ మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలో ప్రతి పాడిరైతుకు చెందిన పశువులకు బీమా సౌకర్యం కల్పించిందని ప్రీమియంతో అమలవుతుందని, ఈ పథకం అందుబాటులో ఉన్నప్పుడే పాడి రైతులు బీమా సద్వినియోగం చేసుకోవాలనిన్నారు.

మండల ప్రభుత్వ ఖాజీగా ముఫ్తీ షేక్ అబ్దుల్ సుభాన్

ప్రజాశక్తి- చౌడేపల్లి: పుంగనూరు నియోజకవర్గ చౌడేపల్లి మండల ప్రభుత్వ ఖాజీగా టిడిపి సీనియర్ నాయకుడు ముక్తి షేక్ అబ్దుల్ సుభాన్ నియమితులయ్యారు. ఈ మేరకు పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ముఫ్తీ షేక్ అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ తనమీద నమ్మకంతో అప్పగించిన పనిని శ్రద్ధాశక్తులతో నిర్వహించి మంచి పేరు తెస్తానని అన్నారు. కార్యక్రమంలో హమీద్ ఖాన్, ఎస్ఎండి గని, పాల్గొన్నారు.

సిఎంకి కృతజ్ఞతలు తెలిపిన శాంతారామ్



ప్రజాశక్తి- కుప్పం టౌన్: టిడిపి నాయకులు, టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్ కుటుంబ సమేతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆశీస్సులు పొందినట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గం సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే తండ్రి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు చెక్కులను పంపిణీ చేశారు. చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్ పేటకు వి.చెన్నకేశవులు శెట్టి రూ.38,914, నాయని చెరువుకు చెందిన కె.లోకేష్ రూ.3.27లక్షలు, గుడిపాల మండలం 189కొత్తపల్లికి చెందిన ఎస్.లలిత రూ.1.12లక్షలు, చిత్తూరుకు చెందిన ఎం.చిన్నమ్మకు రూ.3.17లక్షలు చెక్కులను అందించారు.

నేడు నారా భువనేశ్వరి కుప్పం పర్యటన

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్నట్టు టిడిపి వర్గాలు తెలిపాయి. ఈ పర్యటనలో భాగంగా ఆమె శుక్రవారం ఉదయం 9.05 గంటలకు హైదరాబాద్ నుండి బయలుదేరి విమానంలో 10.20 గంటలకు బెంగళూరు ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.15 గంటలకు శాంతిపురం మండలం రాళ్ళబుదుగురు గ్రామంలోని కోదండ స్వామి ఆలయానికి చేరుకొని, స్వామివారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నట్టు తెలిపారు. రాళ్ళబుదుగురు నుండి కదిరి ముత్తనపల్లి చేరుకొని సిద్దేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పెద్దదేవర జాతరలో పాల్గొని, మధ్యాహ్నం 3గంటలకు బెంగళూరు విమానాశ్రయానికి తిరుగు పయనమవుతారని తెలిపారు.

ఏపీ పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి- కుప్పం టౌన్

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమా కోర్సులలో ప్రవేశాల కొరకు, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి వారు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కుప్పం పట్టణంలోని డాక్టర్ వైసి జేమ్స్ ఎన్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాథరావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాల కొరకు బుధవారం నుండి ఆన్లైన్లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. పాలిసెట్ – 2025 దరఖాస్తు చేసుకొనుటకు ఏప్రిల్ 15వ తేదీ వరకు అవకాశం ఉందని, దరఖాస్తుదారులకు ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 30వ తేదీన కుప్పం, పలమనేరు కేంద్రాలలో నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, 10వ తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ప్రకటించారు. పాలిసెట్ కు దరఖాస్తు చేసుకొను వారు తమ 10వ తరగతి పరీక్ష హాల్ టికెట్టు, పాస్‌పోర్టు సైజు కలర్ ఫోటో, ఆధార్ కార్డు, ఓటిపి కొరకు సెల్‌ఫోను, దరఖాసు రుసుం చెల్లించుటకు ఏటిఎం కార్డు తప్పకుండా తీసుకు రావలెనని తెలిపారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకొనేవారు డాక్టర్. వై.సి. జేమ్స్ మెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వారు ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో గాని, పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వారు ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో గాని ఉచితంగా రిజిస్టరు చేసుకోవచ్చని, లేదా ఇంటర్‌నెట్ సెంటర్ సైతం ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులకు పదవ తరగతి పరీక్షలు అయిన తరువాత, ఏప్రిల్ మొదటి వారంలో పాలిసెట్‌కు ఉచిత కోచింగ్, ఉచిత మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు 94903 09037, 99890 64100 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

మాతా శిశు మరణాలు పునరావృతం కాకూడదు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంసిహెచ్ నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ గురువారం మాత ,శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి నెలలో జరిగిన ఒక మాతృమరణం,8 శిశు మరణాలపై సంబంధిత వైద్యాధికారులు, బంధువర్గం, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు అంగన్వాడీ, ఆశ కార్యకర్తలతో మరణాల కారణాలపై ప్రత్యక్షంగా సమీక్షించారు. డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ మాతృ, శిశు మరణాల కారణాలు తిరిగి పునరావృతం కాకుండా పక్కా యాక్షన్ ప్లాన్‌తో లోపాలను సరిదిద్దుకొని ఆరోగ్య సేవలు అందించాలన్నారు. హానికర లక్షణాలు కనిపించిన వెంటనే 108 ద్వారా రిఫరల్ పై, కచ్చితత్వంతో జాగ్రత్తలు పాటించాలని, శిశువులలో తల్లిపాలు ప్రాముఖ్యత, ప్రాణాంతకమైన వ్యాధినిరోధక టీకాలను ముందుగానే వేయించి శిశు మరణాలు తగ్గించుటలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. ఎంసీహెచ్ కోఆర్డినేటర్ డాక్టర్ అనుష, డాక్టరు ఉషశ్రీ, డాక్టర్ లత, డాక్టర్ పల్లవి, డాక్టర్ ఆయేషా, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, 108 సిబ్బంది మోహన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు


మహిళలకు రక్షణ కల్పించాలి

సీనియర్ సివిల్ జడ్జి ఎం.భారతి



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: పిల్లలకు, మహిళలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.భారతి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వేపంజేరి గ్రామంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి పుష్కరిణి ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి భారతి మాట్లాడుతూ బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను తెలుపుతూ ఇలా జరగకుండా సచివాలయ పరిధిలోని మహిళా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారిని వెంకటేశ్వరి, లీగల్ ఆఫీసర్ ఎంఎస్ వెంకటేష్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ చంద్రశేఖర్, సిడిపిఓ వినతశ్రీ, ప్రొటెక్షన్ ఆఫీసర్ శివశంకర్, బాలల పరిరక్షణ సమితి సిబ్బంది షణ్ముగం, మురళి, వీఆర్వో శివాజీ, వేపంజేరి పంచాయతీ సెక్రెటరీ భావన పాల్గొన్నారు.

ప్రతిభను కనబరిచిన పీఈఎస్ విద్యార్థులు



ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గంలోని పీఈఎస్ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచినట్టు కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ కృష్ణారావు తెలిపారు. ఈ సంవత్సరం జనవరి నెలలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వారు ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. తమ కళాశాల తరఫున మొత్తం 146 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 133 మంది ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. ఇందులో 81 శాతం మార్కులతో పి.ధార్మికశ్రేష్ఠ అగ్రస్థానంలో నిలవగా, 80 శాతం మార్కులతో ఆస్తాగోల్, పి.లక్ష్మిమానస, ఎం.భవిష్య, పి.శ్రీదీప్తి ద్వితీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



17న మహాధర్నాను జయప్రదం చేయండి : మల్లయ్య

ప్రజాశక్తి- గంగవరం: రాష్ట్ర గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక యూనియన్, సిఐటియు పిలుపుమేరకు పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించి గుర్తింపు కార్డులతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, టెండర్ల విషయంలో హైకోర్టు తీర్పు అమలు చేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జి.మల్లయ్య డిమాండ్ చేశారు. ఈనెల 17న విజయవాడలో జరిగే మహాధర్నాలో పంచాయతీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్ర వరకు ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామన్నా మాటలు సభలకే పరిమితమవుతున్నాయని, ఆచరణలో ఉండటం లేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు.

అంతర్జాతీయ పోటీల్లో మెరిసిన పీఈఎస్ విద్యార్థులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు లోని సుఖీభవ కళ్యాణ మండపం వేదికగా యూసీ మాస్ అబాకస్ ఆరవ అంతర్జాతీయ పోటీలలో భాగంగా చిత్తూరులోని అన్ని పాఠశాలలకు సంబంధించి దాదాపు 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 13 మంది పీఈఎస్ విద్యార్థులు లక్ష్మీ జోస్న, తేజశ్రీ, భవనేష్, షైక్ అయత్, దమయంతి, విష్ణు, రుచిత, కార్తిషారెడ్డి, త్రినయ్ రెడ్డి, రిష్విక్, శ్రీకర్, లాస్య, అక్షయ చౌదరి వివిధ విభాగాలకు సంబంధించి బహుమతులను సొంతం చేసుకున్నారని పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు తెలిపారు. వీరికి ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులకు, అబాకస్ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. పాఠశాల డైరెక్టర్ కుమారస్వామినాయుడు పాల్గొన్నారు.

'వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో జిల్లా అధ్యక్షులు గడదేశీ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని గురువారం వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలవేసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసంబ్లీ సమీవేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వాల్మీకి బోయలను ఎస్టీల జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో సభపతికీ విన్నవించిన కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా యూత్ అధ్యక్షులు ముదరంపల్లి రెడ్డెప్ప, తలారి రమేష్, దొరస్వామి నాయుడు, మల్లప్ప, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.9.42 లక్షల ఆదాయం

ప్రజాశక్తి- రొంపిచర్ల: మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ వారపు సంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్ వేలం పాట ద్వారా రూ.9.42లక్షలు ఆదాయం పంచాయతీకి వచ్చినట్లు గ్రామ సర్పంచ్ ఆర్ ఇబ్రహీం ఖాన్ తెలిపారు. గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన బహిరంగ వేలం పాటలో ప్రతి సోమవారం జరిగే వారపు సంతకు రూ.6.34 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.1.58లక్షలు, ప్రైవేటు బస్టాండ్‌కు రూ.1.5 లక్షలు హెచ్చుపాటదారులు సొంత చేసుకున్నట్లు పంచాయతీ ఈవో సత్యంరెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అడవి జంతువుల కోసం వేసిన

కరెంట్ ఉచ్చుకు యువకుడు బలి

- పుట్టినరోజునే కబలించిన మృతువు - కొత్తపల్లి గ్రామంలో విషాదం



మృతుడు కార్తిక్ (ఫైల్‌ఫొటో)



ప్రజాశక్తి- గంగవరం

కరెంట్ షాక్‌తో యువకుడు పుట్టినరోజు మృత్యువాత పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తిప్పన్నగారి మహాదేవరెడ్డి, శాంతమ్మ కుమారుడు కార్తీక్ (22) కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. కార్తీక్ తన స్నేహితులతో బుధవారం తన ఇంటిలో ఘనంగా పుట్టినరోజు జరుపుకొని ఆనందంగా ఉన్న సమయంలో తమ పశువులు మేతకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో రాత్రి పశువులను వెతకడానికి తన స్నేహితులైన యుగంధర్, ధనుంజయ్, భువనచంద్రతో కలిసి వెతకడానికి వెళ్లాడు. మేలుమాయి గ్రామానికి చెందిన వ్యవసాయ పొలాల్లో భూమి మీద ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో కార్తిక్ అక్కడికక్కడే మృతిచెందగా, యుగంధర్ తీవ్రగాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారితో వచ్చిన స్నేహితులు చూసి కేకలు వేయడంతో గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికి కార్తీక్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గంగవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం - వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- చౌడేపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని దిగువపల్లి పంచాయతీ కొలింపల్లిలో అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఏఎస్ఐ వాసు సిబ్బందితో గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన మురళీకృష్ణ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులకు తీసుకొని అతని నుంచి మద్యం స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- చౌడేపల్లి: మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణంలో గురువారం సీనియర్ ఉపాధ్యాయులు పుష్పలత, పుదిపట్ల హైస్కూల్ రికార్డు అసిస్టెంట్ భాగ్యలక్ష్మిలను ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ ఘనంగా సత్కరించి మెమెంటోలు అందించారు. ఎంఈవోలు మాట్లాడుతూ మండలంలో బాలికల విద్యాభివృద్ధికి మహిళా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలన్నారు. వివిధ రంగాలలో మహిళల కృషిని గొప్పతనాన్ని కొనియాడారు.మండల ఉపాధ్యాయ సంఘ నాయకులు లింగమూర్తి, జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ నాయుడు, బాబు రమేష్, డిటి నాగరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

'చట్టసభలో వడ్డెరులకు స్థానం కల్పించాలి'

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : చట్టసభల్లో వడ్డెరులకు స్థానం కల్పించాలని రాష్ట్ర వడ్డెర సంఘ అధ్యక్షులు దేవల మురళి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెరులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామీణ ప్రాంతంలో కులవృత్తులు చేపట్టి జీవనం సాగిస్తున్నారని వారికి కార్పొరేషన్ ద్వారా ఆర్థికసహాయం అందివ్వాలన్నారు. రాజకీయంగా గ్రామస్థాయి నుండి చట్టసభల వరకు స్థానం కల్పించి వడ్డెరల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు రవీంద్రరాజు, నియోజకవర్గ అధ్యక్షులు అశోక్, మురుగేష్, ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.